# చిత్ర కదంబం

## సినీ బఠాణీలు

### ఏరుకొచ్చినవారు - సినీజ్ఞానానందమహర్షి




1971 లో విడుదలై చరిత్ర సృష్టించిన 'దసరాబుల్లోడు' చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు అంత త్వరగా మర్చిపోలేరు. ఆ చిత్రం ఒక విజయవంతమైన నిర్మాతని విజయవంతమైన దర్శకుడిగా మార్చింది. ఈ విషయాన్ని అక్కినేని గారు తన నేను-నా దర్శకులు అన్న పుస్తకంలో ఇలా వ్రాసుకున్నారు

- కథ అల్లుకోడంలో, స్క్రిప్టు సిద్ధం చెయ్యడంలో , దగ్గరుండి సంగీతం చూసుకోడంలో రాజేంద్రప్రసాద్ సమర్థుడు. అలాగే 'దసరాబుల్లోడు' స్క్రిప్టు తయారు చేశాడు. పూర్తిగా స్క్రిప్టు తయారైన తర్వాత, నటీ నటుల్ని తక్కిన టెక్నీషియన్లని కూడా దృష్టిలో పెట్టుకుని - ఆ చిత్రాన్ని నన్ను డైరెక్టు చెయ్యమని అడిగాడు! అడగడమేకాదు పట్టుబట్టాడు. "నాకా ఆసక్తి లేదు. ఉద్దేశమూ లేదు. నేనేలా డైరెక్టు చేస్తాననుకున్నావు? అంతా సిద్ధం చేసుకున్నావు- నీకు అన్నీ తెలుసు. షూటింగ్ టైములో సెట్స్‌కి రాకపోయినా టెక్నిక్ అంతా తెలిసిన వాడివి - నువ్వే డైరెక్టు చెయ్యి" అన్నాను. కాదు కూడదన్నాడు. "మేమంతా నీ వెనుక వున్నాం- కథ బావుంది. పాత్రలు బావున్నాయి. నిర్మాతగా ఒక హోదా సంపాదించుకున్న వాడివి, నువ్వే డైరెక్టు చెయ్యి" అని గట్టిగా బలవంతం చేస్తే, ఒప్పుకున్నాడు. ఒప్పుకున్న తర్వాత, తన బాధ్యత మరింత ఎక్కువై, అన్ని విషయాలూ మరింత జాగ్రత్తగా చూసుకున్నాడు. ఏవిధంగా ఎవరి ప్రమేయమూ లేకుండా "దసరాబుల్లోడు" డైరెక్టు చేశాడు. మంచి పాటలు, తగిన చిత్రీకరణ, శృంగారం, డ్రామా- అన్నీ బాగా తీశాడు. తొలి చిత్రంతోనే 'టాప్ డైరెక్టర్' అనిపించుకున్నాడు. ఆ చిత్రం 'సూపర్ హిట్' అయింది. దక్షతగల నిర్మాత, సమర్థుడైన దర్శకుడిగా కూడా మారాడు.!

***



ప్రముఖ గేయరచయిత ఆత్రేయ గారి గురించి ఈ శీర్షికలో చాలా సార్లు ప్రస్తావించుకున్నాం. ఆయన పాటల్లో ఎంత గాఢత ఉందో ఆయన గురించి అన్ని విశేషాలు, పుకార్లు షికార్లు చేస్తుండేవి ఆ రోజుల్లో. ఆయన 'ఇంద్రధనుస్సు' చిత్రంలో వ్రాసిన 'నేనొక ప్రేమ పిపాసిని..' పాట చాలామందికి గుర్తుండే ఉంటుంది. ఆ రోజుల్లో భగ్న ప్రేమికులందరికీ అదొక ప్రార్థనాగీతం అన్న మాట. ఐతే ఆత్రేయ గారికి అప్పటి కాలంలోని ఒక హీరోయిన్ తో మంచి స్నేహం ఉండేదట. ఒక రోజు ఆవిడ ఇంటికి వెళితే ఆవిడ ఆవిడ లోనికి రానివ్వలేదట. అప్పుడు బయటే నిలుచుని ఆయన ఈ పాట

రాసారని ఒక వదంతి..! ఏమైతేనేం ఒక అద్భుతమైన పాటని తెలుగు వారికి అందించిన ఆత్రేయ గారిని తెలుగు వారు ఎప్పుడూ మరిచిపోలేరు. ఈ పాట పాడిన బాలు గారు ఎప్పుడు ఎదురైనా "ఒరే బాలూ..ఒక్క సారి ఆ పాట నేనొక ప్రేమపిపాసిని పాడరా.." అని అడిగి మరీ పాడించుకునే వారట..! మనసుకవి ఆత్రేయ తెలుగు వారి మనసుల్లో ముద్రవేసుకున్న పాటలు వేలాదిగా రచించి అజరామరమయ్యారు.

***





చిత్రరంగంలో పరిచయాలు గమ్మత్తుగా ఉంటాయి. బాలసుబ్రహ్మణ్యం గారు గాయకుడిగా పేరు తెచ్చుకుంటున్న కొత్తలో ఒకసారి రాజమండ్రిలో శ్రీరామనవమి ఉత్సవాలకి పాడడానికి వెళ్ళారు. రైల్వే స్టేషన్ దగ్గరకి ఒక అబ్బాయి, అతని చెల్లెలు కల్సి వచ్చి బాలు గారి మెడలో దండవేసి తాము రాజమండ్రిలో బాలు గారి అభిమాన సంఘం స్థాపించామని చెప్పారు. బాలు గారు ఇంత చిన్నవయసులో ఇలాంటి అభిమాన సంఘాలు వగైరాలు వద్దు చక్కగా చదువుకో అని చెప్పారు. ఆ కుర్రాడు, అతని రెండు జెళ్ళ చెల్లెలు మర్నాడు వచ్చి బాలు గారిని తమ ఇంటికి రమ్మని బతిమాలి తీసుకెళ్ళారు. కొన్నాళ్ళకి ఆ రెండు జెడల చెల్లెలు తెలుగు చిత్రరంగాన్ని ఏలే బ్యూటీ క్వీన్ అవుతుందని బాలు గారు ఊహించలేదు. ఆమే జయప్రద! ఆమె బ్రదర్ రాజబాబు.

***



తెలుగు శ్రోతల్ని తన మత్తు కంఠంతో ఎన్నో సంవత్సరాలు గమ్మత్తుగా చిత్తుచేసిన ఎల్లారీశ్వరి గారు తెలుగు అమ్మాయి అనుకుంటారు చాలా మంది. ఆమె అసలు పేరు 'లూర్డు రాజేశ్వరి'. రోమన్ కాథలిక్ కుటుంబానికి చెందిన తమిళ అమ్మాయి. పెద్దవాళ్ళు పెట్టిన పేరు లూర్ద్ మేరీ. వాళ్ళ అమ్మమ్మ వైపు వాళ్ళు మేరి అని పిలిస్తే నాన్నమ్మ వైపు వాళ్ళు హిందూ దేవతలని పూజిస్తూ ఆమెని రాజేశ్వరి అని పిలిచే వాళ్ళు. సినిమాల్లోకి వచ్చినపుడు ఏ.పి.నాగరాజన్ గారు ఆమె పేరుని ఎల్.ఆర్.ఈశ్వరి గా స్థిరపరిచారు.

***



తెలుగు చిత్ర రంగంలో ఎప్పటికీ చెరిగిపోని చరిత్ర సృష్టించిన 'దేవదాసు' చిత్రంలో పార్వతి పాత్రకి ముందుగా అనుకున్న హీరోయిన్ షావుకారు జానకి. ఆ రోజుల్లో డి.ఎల్.నారాయణ గారు అగ్రశ్రేణి నిర్మాత. షావుకారు జానకికి పి.ఆర్.వొ గా ఒక ప్రముఖ డిటెక్టివ్ నవలా రచయిత పనిచేస్తుండే వారు. ఆయన డి.ఎల్.నారాయణ గారి వద్దకి వెళ్ళి షావుకారు జానకి గారి కాల్షీట్ల గురించి అడిగిన తీరు డి.ఎల్ గారికి కోపం తెప్పించింది. ఆ కోపంలో జానకి తన చిత్రంలో నటించలేదని అగ్రిమెంట్ చించేసి ఆ పి.ఆర్.వొని పంపించేసారు. అప్పుడు అక్కినేని పక్కన ఎవరైతే పార్వతి పాత్రకి బావుంటారా అని చర్చించి , అంతకు ముందే తమ 'శాంతి' చిత్రంలో నటించిన సావిత్రిని ఎంపిక చేసారు. ఆ విషయాన్ని అక్కినేనితో కూడా సంప్రదిస్తే ఆయనా ఓకె అన్నారు. ఆ విధంగా శరత్ బాబు సృష్టించిన పార్వతి పాత్రకి ప్రాణ ప్రతిష్ట చేసే అవకాశం సావిత్రికి లభించింది.

***



తెలుగు నటుడు కాకపోయినా ప్రముఖ తెలుగు నటి సావిత్రి భర్తగా తెలుగు వారందరికి పరిచయమున్న జెమినీ గణేశన్ అసలు పేరు గణేశన్ మాత్రమే. జెమిని స్టూడియోలో పనిచేసేవాడు కాబట్టి జెమిని గణేశన్ అనిపిలిచే వారు. సైన్సుగ్రాడ్యుయేట్. మద్రాసులో లెక్చరర్ గా పనిచేసేవాడు. మంచి స్పోర్ట్స్ పర్సన్, అందంగా ఉండేవాడు. 'ఆడది' అతని బలహీనత. తమిళ రంగంలో అతన్ని 'కాదల్ మన్నన్' అని పిలుస్తుండే వారు. నాలుగు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. చివరి దశలో 80 ఏళ్ళు వచ్చాక కూడా సెక్రటరీని పెళ్ళాడితే ఆమె అతన్ని నానా బాధలూ పెట్టి వదిలేసింది. అతని రెండో భార్య పుష్పవల్లి, ప్రముఖ హీరోయిన్ రేఖ తల్లి. మూడో భార్య తెలుగు వారి మహానటి సావిత్రి. వాళ్ళ వివాహం ఎలా జరిగిందంటే - 1948 ప్రాంతాల్లో జెమినీ స్టూడియోలో గణేశన్ కాస్టింగ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవాడు. సావిత్రి వేషాలకోసం వెతుకుతూ జెమిని స్టూడియోకి వెళ్ళినప్పుడు అతనితో పరిచయమయ్యింది. కొన్నాళ్ళకి గణేశన్ వేషాలిప్పించే ఉద్యోగం మానేసి సినిమాల్లో వేషాలెయ్యడం మొదలెట్టాడు. పి.పుల్లయ్య గారు తీసిన 'మనంపోల్ మాంగల్యం' అనే సినిమాలో ఇద్దరూ కలిసి నటించారు. అప్పుడే ఇద్దరు ప్రేమలో పడ్డారు. అప్పటికే జెమిని గణేశన్ పిల్లల తండ్రి అని తెలిసినా సావిత్రి అతడ్ని 1952 లో వివాహమాడింది. అయితే కుటుంబ వ్యవహారాల వల్ల 1956 వరకూ తమ వివాహం విషయాన్ని ప్రకటించలేదు. చివరికి 1956లో పబ్లిక్‌లో చెప్పి, కలిసి జీవించడం మొదలుపెట్టారు.

## ఈ గీతము..ఇది ఏ రాగమో..!.

### సింధుభైరవి రాగంలో

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| నడిరేయి ఏ జాములో | (రంగుల రాట్నం, ఘంటసాల, జానకి ఎస్.రాజేశ్వరరావు) |
| ఏమని పాడెదనో | (భార్యాభర్తలు, పి.సుశీల, ఎస్.రాజేశ్వరరావు) |
| ప్రేమ ఎంత మధురం | (అభినందన, ఎస్.పి.బాలు, ఇళయరాజా) |
| కలమంత కత్తిరేస్తే | (స్వాతిముత్యం... |

## భూపాల రాగం లో

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| తొలిసంజెవేళలో | (సీతారాములు, బాలు, సుశీల, సత్యం) |
| కనుమూసినా కనిపించే | (సంతానం, ఘంటసాల, సుసర్ల దక్షిణామూర్తి) |

## బిలహరి రాగంలో

| పాట | చిత్రం,గానం,సంగీతం |
|---|---|
| ఎవరు నేర్పేరమ్మ యీ కొమ్మకు | (ఈనాటి బంధమేనాటిదో, సుశీల, ఎస్.రాజేశ్వరరావు) |
| మాదీ స్వతంత్ర దేశం | (ప్రైవేటు రికార్డు, టంగుటూరి సూర్యకుమారి, రజని) |

పౌరాణిక చిత్రాల్లో చాలా పద్యాలకి బిలహరి రాగాన్ని ఉపయోగించారు.

## *అంతగా ప్రజాదరణ పొందని సినిమాల్లో ఆత్రేయ రాసిన పాటల్లోని మంచి వాక్యాలు*

భర్త విశ్వాసమే భర్య సౌభాగ్యం
భార్య సౌశీల్యమే భర్తకో స్వర్గం
(కెప్టెన్ నాగార్జున, 1986)

ఓ పిచ్చి దేముడా - మనసిచ్చి చూడరా
ప్రేమించి చూడరా - విలపించి చూడరా
నువ్వేమో పగిలే శిలరా - నేనేమో రగిలే చితిరా
(దాగుడు మూతలు, 1986)



కనులలో లేనిదే కౌగిలిలో దొరకదు
మనసులో లేనిది మాటగా పలకదు
(దాగుడు మూతలు, 1986)

సత్యమన్నది వడ్లగింజలో
దాగి వున్న బియ్యము,
పొట్టులాగ కప్పి వుండును
పుట్టుకతో అజ్ఞానము,
మెరుపులేక మబ్బులేక
కురవదెన్నడు వర్షము,
చినుకుకేలా తెలుసు తనకు
జన్మనిచ్చిన మేఘము!
(పద్మవ్యూహం, 1986)



తెలియకన్న మాటేదైనా విలువ లేనిది
విలువ తెలిసి అన్నది ఎపుడు మాసిపోనిది
గుండెవేగము కొండలైనా ఆపలేనిది
(హెచ్చరిక, 1986)